ఓటు వజ్రాయుధం



- ఓటు హక్కు వినియోగంపై అవగాహన
- డమ్మీ ఈవీఎంల ద్వారా వివరిస్తున్న అధికారులు
- మండలంలో మొత్తం ఓటర్లు 48,156 మంది

అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు హక్కుపొంది, వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఓటరుపై ఉంది. ఓటుతో తన తలరాతను మార్చడంతో పాటు దేశ భవిష్యత్‌ను మార్చే శక్తి ఉంది. మెరుగైన సమాజం నిర్మాణానికి ప్రతి ఓటరు చేతిలో అరుదైన ఆయుధం ఓటు.

ముదిగొండ: ఈ నెల 30న జరగనున్న అంసెబ్లీ ఎన్నికల నేపథ్యంలో కొత్త ఓటర్లకు ఓ వినూత్నమైన టెక్నాలజీతో రూపొందించిన ఓటు వేసే విధానం గైడ్‌ను ప్రతి ఓటరు స్లిప్‌తో బీఎల్‌ఓలు పంపిణీ చేస్తున్నారు. మండలంలోని మొత్తం 48,156 ఓటర్లుండగా, ఈ సారి అధికంగా 18ఏళ్లు నిండిన నూతన ఓటర్లు సుమారు 1,326 మంది ఉన్నారు. మహిళా ఓటర్లు 24,958మంది, పురుష ఓటర్లు 23,197 మంది ఉన్నారు. బీఎల్‌ఓలు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్‌స్లిప్పులతో పాటు ఓటు వేసే విధానం గైడ్‌ను అందజేసి, అవగాహన కల్పిస్తున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు ప్రతి గ్రామంలో పోలింగ్ ఓటర్ స్లిప్‌ల పంపిణీని పర్యవేక్షిస్తున్నారు. నూరుశాతం పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు. ఇప్పటికే ముదిగొండ మండలంలో 85శాతం పూర్తయిందని అధికారులు చెపుతున్నారు. నూతన ఓటర్లకు, ఈవీఎంపై ఓటు వేసే విధానంపై కొంత అవగాహన కలిగి ఉండాలని బీఎల్‌ఓలు, సెక్టార్ ఆఫీసర్లు తెలియజేస్తున్నారు.

ఓటు వేసే విధానం..

- ఓటు వేయడానికి సిద్ధంగా ఉండండి. పోలింగ్ బూతులో మూడవ పోలింగ్ ఆఫీసర్ మీరు ఓటింగ్ కంపార్ట్మెంట్ లోనికి రాగానే బ్యాలెట్ యూనిట్‌ని ఎనేబుల్ చేస్తారు. అప్పుడు బ్యాలెట్ యూనిట్‌లో రెడీ అనే లైట్ వెలుగుతుంది.
- మీకు నచ్చిన అభ్యర్థి పేరు లేదా గుర్తుకు ఎదురుగా ఉన్న నీలం రంగు బటన్ ని నొక్కండి.
- మీరు ఓటు వేసిన అభ్యర్థి పేరు లేదా, గుర్తు వద్ద ఉన్న ఎర్ర లైట్ వెలుగుతుంది. ఓటర్లు ఎర్ర లైట్ వెలుగుతుందా లేదా చూడాలి.
- వేసిన ఓటను సరిచూసుకోండి, వివి ఫ్యాట్ ప్రింట్ అయి, ఓటు వేసిన స్లిప్(మీరు ఓటు వేసిన అభ్యర్థి క్రమ సంఖ్య పేరు, గుర్తు వివరాలతో) కనిపిస్తుంది.
- బీప్ శబ్దాన్ని వినండి. కంట్రోల్ యూనిట్ నుండి -బీప్ శబ్దం వినిబడితేనే మీ ఓటు విజయవంతంగా వేసినట్లు అర్థం.
- మీకు వివిఫ్యాట్ లో బ్యాలెట్ స్లిప్ కనిపించకపోయినా, ప్రిసైడింగ్ ఆఫీసర్‌ను సంప్రదించాలి.
- బ్యాలెట్ స్లిప్ గ్లాస్ విండో ద్వారా ఏడు సెకన్లు పాటు కనిపిస్తుంది. ఆ విధంగా ప్రింట్ అయిన స్లిప్ వీవీ ప్యాట్‌లో భద్రపరచబడుతుంది.

స్వచ్ఛందంగా ఓటు వేస్తా..



ఓటుపై పూర్తి అవగాహన కల్పించుకుని స్వచ్ఛందంగా ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నా, ఎలాంటి ప్రలోభాలకు గురిచేసినా ఒప్పుకోకుండా నా ఓటును వినియోగించుకుంటా, చైతన్యవంతమైన ప్రజాస్వామ్యం కోసం ఓటు హక్కు వినియోగిస్తా.

– నాయిని భరత్,
బీటెక్ సెకండియర్, ముదిగొండ

నా ఓటు అమ్ముకోను..



కొత్తగా వచ్చిన ఓటును సద్వినియోగం చేసుకునేందుకు యాప్‌లో అవగాహన కలిగి ఉన్న ఓటు హక్కు భాధ్యతగా తీసుకుంటా, ప్రజాస్వామ్యం కోసం పాటు పడుతా, నా ఓటును అమ్ముకోను. నిర్భయంగా ఓటు వేస్తా.

– నూక పుష్పక్‌కుమార్,
బీటెక్ సెంకండియర్, కమలాపురం

ప్రజల ఆకాంక్షలు తీర్చేది బీఆర్‌ఎస్సే



కల్లూరురూరల్: లింగాల ప్రచారంలో మాట్లాడుతున్న సండ్ర వెంకటవీరయ్య



తల్లాడ: మహిళను ఓటు అభ్యర్థిస్తున్న నాయకులు

కల్లూరు/కల్లూరురూరల్: ప్రజల ఆకాంక్షలు తీర్చేది బీఆర్‌ఎస్సేనని సత్తుపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లూరు పట్టణంలోని ఏకలవ్య కాలనీవాసులు మూకుమ్మడిగా ఎమ్మెల్యే సండ్ర సమక్షంలో చేరారు. అదే విధంగా కల్లూరురూరల్ మండలంలోని బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు పెడకంటి రామకృష్ణ ఆధ్వర్యంలో 100 మంది యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారందరికీ బీఆర్‌ఎస్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల మధ్యనే ఉంటూ ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేశానని, మారోమారు ఆదరించాలన్నారు. కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అందరికీ చేరాయని, ఎన్నికల్లో గెలిపిస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బీరవెల్లి రఘు, సర్పంచ్ దేవరపల్లి అరుణ, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షులు పాలెపు రామారావు, రైతు సమితి మండల కన్వీనర్ డాక్టర్ లక్కినేని రఘు, యూత్ అధ్యక్షుడు రామకృష్ణ, ప్రసాద్, శ్రీనివాసరావు, రజనీకాంత్, లక్ష్మణరావు, దుర్గాప్రసాద్, కిరణ్‌కుమార్, వంశీ, వెంకటనారాయణ, దుర్గారావు, హనుమంతరావు, కుమారి, పద్మ, తిరుపతమ్మ, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సండ్ర గెలుపు కాంక్షిస్తూ..

తల్లాడ: సండ్ర వెంకటవీరయ్య గెలుపును కాంక్షిస్తూ సోమవారం మండల కేంద్రమైన తల్లాడ, రామానుజవరంలో గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చుతూ జై సండ్ర, జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. రామానుజవరంలో సర్పంచ్ శీలం కోటారెడ్డి ఆధ్వర్యంలో ఓట్టుపెట్టి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు వీరమోహన్‌రెడ్డి, వైరా ఎఎంసీ వైస్ చైర్మన్ భద్రరాజు, జోన్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, జీవీఆర్, షేక్ ఈసూబ్, రఘు, నాగులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, ఆశీర్వాదం, నరేష్‌రాజు, రాము పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను, కరెంట్‌ను ముట్టుకోవ్వద్దు..



ప్రజలను ఓట్లు అభ్యర్థిస్తున్న భట్టి విక్రమార్క



మధిర ర్యాలీలో పాల్గొన్న మల్లు నందిని విక్రమార్క, తదితరులు

- ఆరు గ్యారంటీలను బరాబర్ అమలుచేస్తాం
- దేశంలోనే మధిరను ఆదర్శంగా తీర్చిదిద్దుతా
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క

బోనకల్: సీఎం కేసీఆర్.. కాంగ్రెస్‌ను, కరెంట్‌ను ముట్టుకుంటే మాడి మసైపోతావని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, మాజీ మంత్రి శైలజానాథ్ కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లోని ప్రజలు వారికి బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుబంధు రాదు, కరెంట్ ఉండదని కేసీఆర్ పిచ్చిమాటలు మానుకోవాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే ఆరు గ్యారంటీలను బరాబర్ అమలు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ గుర్తు 'హస్తం'పై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కేసీఆర్‌లాగా తాము ప్రజలను మోసం చేయమని, రాబోవు కాంగ్రెస్ పార్టీ ఏర్పాటులో కీలక భూమిక పోషిస్తానని, మధిరకు నిధులు వరదలా పారిస్తానన్నారు. యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పిస్తానని మధిరను సమగ్ర ప్రణాళికతో అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గాలి దుర్గాప్రసాద్, పైడిపల్లి కిషోర్, బందం నాగేశ్వరావు, పిల్లలమర్రి నాగేశ్వరరావు, షేక్ షాజాహాన్, జానీమియా, సత్యనారాయణరెడ్డి, మురళి, సుబ్బారావు, నారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

భట్టిని గెలిపించాలి..

మధిర/ఎర్రుపాలెం: మధిర నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్కకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన సతీమణి నందిని, కాంగ్రెస్, టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. మధిరలోని శాంతి థియేటర్ నుంచి టౌన్ పోలీస్ స్టేషన్ వరకు భారీ ర్యాలీ కొనసాగింది. ఎర్రుపాలెంలో నాయకులు ఓటర్లకు ఆరు గ్యారంటీలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భట్టి గెలుపుతో మధిర రూపురేఖలు మారుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రంగా మధులత, రూప, కోనా సుచరిత, గద్దం జ్యోతి, అనిత, రమాదేవి, యన్నం రజిని, కర్నాటి జ్యోతి, టీడీపీ మండల కమిటీ అధ్యక్షులు సామేలు, ఇరు పార్టీల నాయకులు రామారావు, ఇస్మాయిల్, రాజేష్, వెంకటనారాయణ, సత్యనారాయణ, మోహన్‌రావు, రవికుమార్, లాలు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

- ఎండలో ఉద్యోగుల అవస్థలు
- జాబితాలు లేక గందరగోళం



సత్తుపల్లిలో పోస్టల్ బ్యాలెట్ల పోలింగ్ కోసం బారులుదీరిన ఉద్యోగులు

సత్తుపల్లిటౌన్: ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించింది. అయితే సత్తుపల్లి మండల సమాఖ్య భవనంలో సోమవారం పోస్టల్ బ్యాలెట్ ఉద్యోగుల కోసం ప్రత్యేక పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రానికి ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఉద్యోగులు, ఇతర సిబ్బంది ఎండలోనే అవస్థలు పడుతూ ఓటింగ్‌లో పాల్గొనాల్సి వచ్చింది. మధ్యాహ్న సమయంలో టెంట్ ఏర్పాటు చేయడంతో ఉపశమనం పొందారు.

జాబితాలు లేక గందరగోళం..

సత్తుపల్లి నియోజకవర్గానికి చెందిన ఉద్యోగులకు ఇతర నియోజకవర్గాల్లో ఎన్నికల విధులు కేటాయించారు. వీరికి సత్తుపల్లిలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వినియోగించుకోవాలని అధికారులు తెలపడంతో రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకున్నారు. ఇక్కడ పోస్టల్ ప్రత్యేక పోలింగ్ బూత్ వద్ద ఉన్న జాబితాలో పేర్లు లేకపోవడంతో ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం లేకపోవడంతో ఆందోళన వ్యక్తం చేశారు. ఓటు వేయించాల్సిన వారికే ఓటు లేకుండా చేస్తున్నారని నిరసన వ్యక్తం చేశారు. పోస్టల్ బ్యాలెట్లు అయినా ఇవ్వండి, ఎన్నికల విధుల నుంచి అయినా తప్పించండంటూ అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. దీంతో తహసీల్దార్ యోగేశ్వరరావు జోక్యం చేసుకుని మంగళవారం కల్లా జాబితాను సిద్ధంచేసి ఓటుహక్కు కల్పిస్తామని సర్దిచెప్పారు.

ఉద్యోగుల ఆందోళన..



ఉద్యోగులకు బ్యాలెట్ కేటాయిస్తున్న అధికారులు

వైరా: వైరా నియోజకవర్గంలో 616 మంది వివిధ శాఖల ఉద్యోగులకు భద్రాద్రి కొత్తగూడెంలో జిల్లాలో ఎన్నికల విధులు కేటాయిస్తూ అధికారులు ఆర్డర్ కాపీలు అందజేశారు. కానీ అక్కడి జిల్లాలో ఓటుహక్కు వినియోగించుకునేందుకు బ్యాలెట్ ఇవ్వకపోవడంతో తిరిగి వైరా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకుని ఓటు వేస్తామని బ్యాలెట్ ఇవ్వాలంటూ ఆందోళనకు దిగారు. దీంతో అధికారులు హడివిడిగా ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి ఓటు సద్వినియోగం చేసుకునేందుకు బ్యాలెట్‌ను అందించారు. అధికారుల నిర్లక్ష్యంపై ప్రభుత్వ ఉద్యోగులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా


ఓటు వినియోగించుకున్న ఏసీపీ



వైరా ఏసీపీ ఎంఏ రహమాన్

వైరా: వైరా ఏసీపీ ఎంఏ రహమాన్ స్థానిక రిటర్నింగ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్నారు. తన ఓటు వరంగల్ జిల్లాలో ఉన్నప్పటికీ అక్కడి నుంచి పోస్టల్ బ్యాలెట్ తెప్పించుకుని ఓటు వేయడం జరిగింది. అనంతరం ఓటు వేలిక సిరామార్కు చూపించారు.

శాలివాహనుల వనసమారాధన



వనసమారాధనలో పాల్గొన్న శాలివాహన కులస్తులు

కొణిజర్ల: మండలంలోని బస్వాపురం గ్రామంలో శాలివాహనుల వనసమారాధన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన శాలివాహనులు, వారి బంధువులు సమీపంలోని మామిడి తోటకు వెళ్లి అక్కడ కార్తీక మాస పూజలు నిర్వహించి సామూహిక భోజనాలు చేసి సాయంత్రం వరకు సంబరంగా గడిపారు. ఈ కార్యక్రమంలో సముద్రాల రామయ్య, సీతమ్మ, రాములు, అనసూర్యమ్మ, ఆదినారాయణ, వెంకటరాములు, వెంకటేశ్వర్లు, భార్గవి, అంకలయ్య, వెంకటరత్నం, నాగేశ్వరరావు, కృష్ణమ్మ పాల్గొన్నారు.

ఎందుకు అడ్డు వస్తున్నారు?

మధిర: కాంగ్రెస్ కార్యకర్తలను మధిర బీఆర్‌ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజ్ దూషించిన ఘటన ఆదివారం రాత్రి మండలంలోని దెందుకూరు లో చోటుచేసుకుంది. ఆ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు ర్యాలీ తీస్తుండగా , అదే సమయాన కమల్‌రాజ్ ప్రచారం చేస్తున్నారు. దీంతో ఆయన 'మీ మీటింగ్‌లకు మేము అడ్డు వస్తున్నామా' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీజేపీని ఆదరించండి



సత్తుపల్లిలో నిర్వహించిన ర్యాలీలో రామలింగేశ్వరరావు, నాయకులు

సత్తుపల్లి/తల్లాడ: సత్తుపల్లి అభివృద్ధి కోసం డబుల్ ఇంజిన్ సర్కార్ వచ్చేలా బీజేపీని ఆదరించాలని ఆ పార్టీ అభ్యర్థి నంబూరి రామలింగేశ్వరరావు కోరారు. సత్తుపల్లి పట్టణంలో సోమవారం మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందని, తనను గెలిపిస్తే సత్తుపల్లి జిల్లా ఏర్పడుతుందని తెలిపారు. నాయకులు నాయుడు రాఘవరావు, మున్నా మిశ్రా, పగిడాల మధు, పాలకొల్లు శ్రీనివాసరావు, ఆచంట నాగస్వామి, వేణు, అనూష, సాయిచంద్, అప్పారావు, రహ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు. ఇక తల్లాడ మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ అభ్యర్థి రామలింగేశ్వరరావు తరపున ఆ పార్టీ ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జి దేవకీ వాసుదేవరావు ప్రచారం చేశారు. నాయకులు ఆపతి వెంకటరామారావు, సంగీతం సాయిచంద్, తెనాలి దినేష్, నంబూరి శ్రీనివాసరావు, బాబురావు, పాపారావు, రాయల రమేష్, ఎల్లంకి సుదాకర్, కర్నాటి సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌దే మళ్లీ అధికారం

ఎర్రుపాలెం: తెలంగాణలో కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారని మధిర బీఆర్‌ఎస్ అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ సోదరుడు రవికుమార్, మార్కెట్ మాజీ చైర్మన్ రామకృష్ణ, ఎంపీపీ శిరీష, జెడ్పీటీసీ కవిత తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో కమల్‌రాజ్‌ను గెలిపించాలని కోరుతూ సోమవారం ఇంటింటి ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు పంబి సాంబశివరావు, నాయకులు సత్యనారాయణరెడ్డి, రవికుమార్, అప్పారావు, శ్రీనివాసరెడ్డి, మల్లిఖార్జున్‌రెడ్డి, కిశోర్, రామకృష్ణ, స్టాలిన్, శ్రీను, రామిరెడ్డి, కృష్ణారెడ్డి, నరేందర్‌రెడ్డి, భాస్కర్, రామకోటయ్య, నవీన్, రంగయ్య, పెద్దరత్తయ్య, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కారు గుర్తుపై ఓటు వేయండి

కారేపల్లి: మండలంలో బీఆర్‌ఎస్ వైరా అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ సోమవారం విస్తృత ప్రచారం చేశారు. కారేపల్లి క్రాస్ రోడ్ నుంచి ప్రారంభమైన ప్రచారం పలు గ్రామాల్లో కొనసాగింది. ఈ ప్రచారంలో ఎంపీపీ మాలోత్ శకుంతల, జెడ్పీటీసీ జగన్, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, ఎంపీటీసీ వసంతవెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు ఉమాశంకర్, రమేష్, పిచ్చయ్య, ఐలయ్య, శ్రీనివాసరావు, కుమార్‌తో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి వలసలు

మధిరరూరల్: మండలంలోని నాగవరప్పాడు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్, సీపీఎం పార్టీల నుంచి పలువురు కాంగ్రెస్‌లోకి చేరారు. నాగవరప్పాడు మాజీ సర్పంచ్ చావలి రామరాజు, తోకా రామారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడే సూరంశెట్టి కిషోర్ ఆధ్వర్యంలో సోమవారం మధిరలోని ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క క్యాంపు కార్యాలయంలో.. సిద్ధినేనిగూడెం మాజీ ఎంపీటీసీ ఆంజనేయులు, తోకా సుబ్బయ్య, చల్లా వెంకటకృష్ణ, ముచ్చు నాగేశ్వరరావు, తోకా వెంకయ్య, చావలి రాజారావు తదితరులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి భట్టి సతీమణి మల్లు నందిని విక్రమార్క కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రెబ్బవరం గ్రామంలో బీఆర్‌ఎస్‌కు చెందిన 25 కుటుంబాలు..



పార్టీలోకి ఆహ్వానిస్తున్న దానియేలు

వైరారూరల్: మండలంలోని రెబ్బవరంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 25 కుటుంబాలు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ కిసాన్ ఖేత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసరి దానియేలు కాంగ్రెస్ చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు గుత్తా శ్రీనివాసరావు, దాసరి జాన్, రెంటాల సుధీర్, కృష్ణ, బాబురావు, మాధవరావు పాల్గొన్నారు.

పొంగులేటి తల్లి ఆశీర్వాదం తీసుకున్న రాగమయి



కల్లూరురూరల్: స్వరాజ్యమ్మ ఆశీర్వాదం తీసుకుంటున్న రాగమయి

కల్లూరురూరల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా సత్తుపల్లి కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మట్టా రాగమయి సోమవారం కల్లూరు మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని నారాయణపురంలో కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తల్లి స్వరాజ్యమ్మను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. చేయి గుర్తుపై ఓటు వేసి తనను గెలిపంచాలని కోరారు. ఆతర్వాత గ్రామంలో ఇంటింటి ప్రచారం చేసిన రాగమయి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలుచేయనున్న ఆరు గ్యారంటీలను వివరించారు. నాయకులు అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ కనకదుర్గ పాల్గొన్నారు.

తప్పుడు హామీలు నమ్మొద్దు..

తల్లాడ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇస్తున్న తప్పుడు హామీలను నమ్మి మరోమారు మోసపోవద్దని సత్తుపల్లి కాంగ్రెస్ అభ్యర్థి మట్టా రాగమయి కోరారు. తల్లాడ మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం చేసిన ఆమె మాట్లాడుతూ రెండు సార్లు ప్రజలు అధికారం ఇచ్చినా హామీలను అమలుచేయకపోగా ఏ వర్గానికి న్యాయం చేయలేదని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఈసారి కాంగ్రెస్‌ను గెలిపించాలని, తద్వారా ముందుగా ప్రకటించిన ఆరు గ్యారంటీలు అమలుచేస్తామని చెప్పారు. నాయకులు జక్కంపూడి కృష్ణమూర్తి, దగ్గుల రఘుపతిరెడ్డి, పొట్టేటి సంధ్యారాణి, సరికొండ పద్మావతి, కాపా సుధాకర్ తదితరులుపాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి..

పెనుబల్లి: కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ జిల్లా నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించి మాట్లాడుతూ.. సత్తుపల్లి నియోజకవర్గంలో డాక్టర్ రాగమయి అత్యధిక మెజార్టీతో గెలుస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు వంకాయలపాటి వెంకటేశ్వరరావు, దేశిన్ని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గెలిచే ఎమ్మెల్యేలకే గ్యారంటీ లేదు..



మాట్లాడుతున్న భాస్కర్, పక్కన సాయిబాబా

ఎర్రుపాలెం: కాంగ్రెస్ పార్టీలో గెలిచే ఎమ్మెల్యేలకే ఆ పార్టీలో ఉండే గ్యారంటీ లేదని, ఇక వారు ఆరు గ్యారంటీలు ప్రజలకు ఏమి ఇస్తారని సీఐటీయూ ఆలిండియా కార్యదర్శి సాయిబాబా విమర్శలు చేశారు. సోమవారం మండలంలోని మీనవోలు, తక్కెళ్లపాడు, ములుగుమాడు, సఖినవీడు, ఇనగాలి, రామన్నపాలెం, తదితర గ్రామాల్లో సీపీఎం అభ్యర్థి పాలడుగు భాస్కర్ విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే సీపీఎం అభ్యర్థులను గెలిపించాలన్నారు. పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. ఒక్కసారి ఆశీర్వదించి గెలిపించి అసెంబ్లీకి పంపితే ప్రజలకు తోడుగా ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య, నాయకులు సగుర్తి సంజీవరావు, గామాసు జోగయ్య, జార్జి పాల్గొన్నారు.

వైభవంగా కార్తీకపౌర్ణమి వేడుకలు

మండలంలో పలు ఆలయాల్లో కార్తీకపౌర్ణమి వేడుకలను భక్తులు సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామునే పుణ్యస్నానాలను ఆచరించి ఆయా గ్రామాల్లోని శివాలయాల్లో స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం దేవాలయాల్లోని నాగేంద్రుని విగ్రహాలు, ఉసిరి, తులసి చెట్ల వద్ద కార్తీక దీపాలను వెలిగించి పూజలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



వైరా: పాత శివాలయంలో దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న మహిళలు



ఎర్రుపాలెం: బనిగండ్లపాడు శివాలయంలో..



కొణిజర్ల: పల్లిపాడు శివాలయంలో..



తల్లాడ: రామలింగేశ్వర స్వామి దేవాలయంలో గోత్రనామపూజ చేస్తున్న అర్చకుడు సతీష్ శర్మ



సత్తుపల్లిటౌన్: శివలింగానికి పూజలు చేస్తున్న మహిళలు



కారేపల్లి శివాలయంలో..

ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ల అడ్‌హక్ కమిటీ ఎన్నిక



కొణిజర్ల మండల ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ యూనియన్ సభ్యులతో జిల్లా నాయకులు

కొణిజర్ల: కొణిజర్ల మండల ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ల అడ్‌హక్ కమిటీని సోమవారం ఖమ్మం జిల్లా ప్రైవేట్ ఎలక్ట్రీషియన్, వైర్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జడల అంజయ్య ఆదేశాల మేరకు జిల్లా నాయకులు ప్రకటించారు. సంఘం మండల అధ్యక్షుడిగా అమర్లపూడి సుమన్, ఉపాధ్యక్షుడిగా ఎస్‌కే నాగులు, ప్రధాన కార్యదర్శి ఇటుక ఉపేందర్, సహాయ కార్యదర్శి లకావత్ సీతారాములు, కోశాధికారి షేక్ ఘని, ప్రచార కార్యదర్శి చల్లా వెంకన్నలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలరాజు, హసీం, షరీఫ్, ప్రధాన కార్యదర్శి గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.